
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 26 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 16.0

జన.. ఘన.. మననం

- నిత్యం జాతీయ గీతాలాపన
- ఉదయం 8.30 గంటలకు కూడళ్లలోని మైకుల్లో
- నాలుగేళ్ల కిందట నల్లగొండలో ప్రారంభం
- కొన్నాళ్లుగా నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారంలోనూ..
- స్ఫూర్తిగా నిలిచిన కార్యక్రమం

చాలామంది బాల్యంలో పంద్రాగస్టు, రిపబ్లిక్‌డే సందర్భంగా జాతీయ గీతాలాపన చేసి వందనం చేసి ఉంటారు. కానీ, నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాత్రం నిత్యం జాతీయగీతాలాపన చేస్తుంటారు. అదీనూ ఒకే సమయంలో.. ప్రజల్లో జాతీయతను పెంపొందించేందుకు జనగణ మన కమిటీలు ఏర్పాటు చేసుకుని కూడళ్లలో జాతీయ గీతాన్ని వినిపిస్తున్నారు. ఇలా నాలుగేళ్ల కిందట నల్లగొండ జిల్లా కేంద్రంలోని 12 కూడళ్లలో మొదలైన ఈ కార్యక్రమం మరో మూడు మండల కేంద్రాల్లో చేపట్టేందుకు స్ఫూర్తిగా నిలిచింది.

•6లో..



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జనగణమన ఆలాపన చేస్తున్న జనగణమన కమిటీ సభ్యులు



పెద్దగట్టుపై చిన్నచూపు

రాష్ట్రంలో సమ్మక్క సారక్క తర్వాత పెద్దగట్టు జాతర (లింగమంతుల స్వామి) అతిపెద్దది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు సుమారు 10లక్షల మందికిపైగా భక్తులు వస్తుంటారు. ఇంతటి ప్రజాసమూహం సందర్శించే పెద్దగట్టు జాతర నిర్వహణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న విమర్శలు భక్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరకు అప్పటికప్పుడు నిధులు విడుదల చేయడం, ఆయా నిధులతో తాత్కాలిక పనులు చేపట్టడం వంటి తీరును భక్తులు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ప్రభుత్వంలోని 11 శాఖల నడుమ సమన్వయంతో చేపట్టాల్సిన ఏర్పాట్లను దేవాదాయ, మునిసిపల్ శాఖలే సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, సూర్యాపేట

- సమ్మక్కసారక్క తర్వాత పెద్దజాతర
- రెండేళ్లకోసారి జాతర, అయినా నిధుల విడుదలలో జాప్యం
- 21 రోజులే గడువు.. ఇంకా పూర్తిస్థాయిలో చేపట్టని జాతర పనులు
- ప్రతీ పర్యాయం తాత్కాలిక ఏర్పాట్లే
- 10లక్షల మంది పాల్గొనే జాతర

పెద్దగట్టు ఆలయం సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోకి వస్తుంది. పెద్దగట్టుపైన దేవాదాయ శాఖ, గుట్ట కింద మునిసిపాలిటీ శాఖలు భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అయితే ప్రతీ జాతరలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎవరి పరిధిలో వారు పనులు చేసుకుంటున్నారు. నిధుల వినియోగంలో సమన్వయం లేదని గత పాలకవర్గాలు ఆరోపిస్తున్నాయి. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు పెట్టుకుంటున్నారే తప్ప ప్రత్యక్షంగా జాతర ఏర్పాట్లపై ఇంతవరకు సమీక్ష నిర్వహించలేదు. మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపులో ఆలస్యంతో ఆదరాబాదరాగా పనులు చేపడుతున్నారు.

21 రోజుల్లో జాతర

పెద్దగట్టు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ పర్యాయం జాతరకు ఇంకా 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఫిబ్రవరి 2న దిష్టిపూజతో లింగమంతుల పండుగ వాతావరణం నెలకొంటుంది. అప్పటినుంచి భక్తుల రాకపోకలు జరుగుతాయి. నిధులు మంజూరుకాకపోవడవంతో ఇంతవరకూ జాతర పనులు మొదలుకాలేదు. వివిధ శాఖల నుంచి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. ఒక్క శాఖకు కూడా ఇంతవరకు నిధులు కేటాయింపు జరగలేదని సమాచారం. పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, ఇతర శాఖలకు నిధులు కేటాయిస్తే పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తూ అధికారులు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో ఆయా ప్రధాన శాఖల అధికారులకు దిగులు పట్టుకుంది. ఎప్పుడు ప్రకటించి, ఎప్పుడు పనులు చేపట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా చెరువులో నీరు ఉండటంతో గుట్టకు దూరంలో 70ఎకరాలను లీజుకు తీసుకున్నారు. అక్కడ సౌకర్యాలు కల్పించడానికి అధికారులు సమయం సరిపోదంటున్నారు. త్వరగా నిధులు కేటాయిస్తేనే పనులు చేసే అవకాశం ఉంటుందని కొంతమంది అధికారులు తెలిపారు.



పెద్దగట్టు వద్ద నిరుపయోగంగా ఉన్న మంచినీటి కుళాయిలు

శాశ్వత పనులేవీ?

గుట్టపైన శాశ్వత పనులను పూర్తిస్థాయిలో చేపట్టలేదు. గుట్టపైకి వచ్చే భక్తులకు కొంతమేర

మిగతా 6వ పేజీలో...



నల్లగొండ మునిసిపాలిటీలో కౌన్సిల్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వరంగల్‌కు దీటుగా అభివృద్ధి

- కౌన్సిల్ హాల్ ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తరహాలో వరంగల్‌కు దీటుగా నల్లగొండ అభివృద్ధి చెందుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మునిసిపాలిటీలో నూతనంగా నిర్మించిన మునిసిపల్ కౌన్సిల్ భవనాన్ని శనివారం చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో రూ.250కోట్లతో రింగ్‌రోడ్డు ఏర్పాటుకు, రూ.30 వేల కోట్లతో ఔటర్ రింగ్‌రోడ్డు పనులకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. అదేవిధంగా దేవరకొండ రోడ్డులో ఉన్న 55ఎకరాల స్థలంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నల్లగొండ పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా పనులు తన సొంత నిధులతో చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గ పనులు త్వరితగతిన అవుతున్నాయన్నారు. 10 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం రేషన్‌కార్డు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తోందన్నారు. అభ్యంతరకర భాష పద్ధతిని మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి మునిసిపల్ చైర్మన్‌ను, కమిషనర్‌ను, చివరికి తనపై కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం ప్రజలందరూ గమనిస్తునే ఉన్నారన్నారు. భాష మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా కౌన్సిలర్లు అధికారంలో లేకపోయినా ప్రజలకు సేవా చేయాలన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మను అబ్బగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): రానున్న వేసవిలో పట్టణానికి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యామ్నాయ ఫీడర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని బీట్ మార్కెట్‌లో రూ.3 కోట్ల వ్యయంతో

మిగతా 8వ పేజీలో...

జన.. ఘన.. మననం

● నల్లగొండలో నాలుగేళ్లుగా నిత్యం జాతీయ గీతాలాపన ● 12 కూడళ్లలో నిర్వహణ

అదో అద్భుతమైన దేశభక్తి కార్యక్రమం. ఉదయం 8.30 అయిందంటే చాలు నిత్యం కూడళ్లలో జనగణమన వినిపిస్తుంటుంది. మైకుల్లో జాతీయ గీతం ప్రారంభమైన వెంటనే ఎక్కడి వారు అక్కడ నిలబడి జాతీయజెండాకు మనస్ఫూర్తిగా నమస్కరిస్తుంటారు. పలు కూడళ్లల్లో గీతాలాపన ప్రారంభానికి ముందు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో పాటు అక్కడి చిరువ్యాపారులు, ఉద్యోగులు, సైకిళ్లపై స్కూల్‌కు వెళ్లే చిన్నారులు అక్కడే ఆగి సెల్యూట్ చేయడం అద్భుతంగా కనిపించే సన్నివేశం. ఇలాంటి గీతాలాపనతో ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తున్నారు. కొన్నాళ్లుగా జిల్లా కేంద్రమైన నల్లగొండ పట్టణంలోని 12 కూడళ్లతో పాటు నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారం మండలాల్లోనూ ఈ నిత్యజనగణ మన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)





నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జాతీయ గీతాలాపన సమయంలో నిలిచిన వాహనాలు, సెల్యూట్ చేస్తున్న పాదాచారులు, ట్రాఫిక్ కానిస్టేబుల్, ప్రజలు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజును పురస్కరించుకొని 2021 సంవత్సరం జనవరి 23న నల్లగొండలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతిరోజూ ఉదయం 8.08 గంటలకు ముఖ్యకూడళ్ల వద్ద ఉన్న మైకుల్లో దేశభక్తి పాటలు మారుమోగుతుంటాయి. సరిగ్గా 8.29 గంటలకు జాతీయ గీతం ప్రారంభమవుతుంది. ఆ సమయంలో 52 సెకన్ల పాటు జాతీయ గీతాలాపన వచ్చినంతా సేపు ఆయా కూడళ్లలోని ప్రజలంతా జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తారు. యువతలో దేశభక్తి పెంపొందించాలనే సంకల్పంతో జనగణమన ఉత్సవ సమితి ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అంతటికి విస్తరింప చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థులు, యువతలో జాతీయ భావాలను, దేశభక్తిని పెంపొందిచాలనే సంకల్పంతో ఈ గీతాలపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో దానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటుచేసి మైక్ సిస్టమ్‌లకు కేబుల్ ద్వారా ఏకకాలంలో దేశభక్తి పాటలు, జనగణమన జాతీయం గీతం వచ్చేలా ఏర్పాటు చేశారు.

జనగణమన పాడుదాం.. దేశభక్తి చాటుదాం

కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరుగుతున్న నిత్య గీతాలాపనను స్ఫూర్తిగా తీసుకొని నల్లగొండలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సమాచారం. 'దేశం కోసం ఒక నిమిషం' అన్న సందేశంతో ప్రతి నిత్యం జాతీయ గీతాలాపన సాగుతోంది. అన్నివర్గాల ప్రజల్లో దేశభక్తిని పెంచాలన్నా ఉద్దేశ్యంతో 'జనగణమన పాడుదాం, దేశభక్తిని చాటుదాం' అంటూ జనగణమన ఉత్సవ సమితి నిత్య గీతాలాపనకు అంకుర్పారణ చేశారు. నిత్య జాతీయ గీతాలాపనకు ప్రారంభమే కాని చివరి రోజు ఉండవద్దనే ఉద్దేశ్యంతో నేతాజీ జయంతి అయిన జనవరి 2021 జనవరి 23వ తేదీన ప్రారంభించి కొనసాగిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు నల్లగొండలో ప్రతి నిత్యం క్రమం తప్పకుండా కొనసాగిస్తుండగా ఆ తరువాత మొదలైన నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారంలో సైతం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. గతంలో కరోనా సమయంలో దేశభక్తి గీతాలతో పాటు కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ పలు సూచనలు కూడా వినిపించి అవగాహన కల్పించారు.



కర్నాటి విజయ్ కుమార్
జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు

● **దేశభక్తి, క్రమశిక్షణ పెరగాలన్నదే లక్ష్యం**

విద్యార్థులు, యువతతో పాటు అన్నివర్గాల్లో దేశభక్తి, క్రమశిక్షణ ఉండాలన్నా లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని పెంచాలని 'దేశం కోసం ఒక్క నిమిషం' అంటూ కార్యక్రమం చేపట్టాం. అందరూ పాల్గొనడం సంతోషాన్ని కలిగిస్తోంది. జిల్లాలో విస్తరింపచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

ప్రజల భాగస్వామ్యంతోనే నాలుగేళ్లు పూర్తి



నిత్యజాతీయ గీతాలాపన కార్యక్రమానికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. నేటి వరకు నిర్వీరామంగా కార్యక్రమం కొనసాగడం సంతోషకరం. ఉత్సవ సమితితో పాటు ప్రజల భాగస్వామ్యంతో ఇది సాధ్యమైంది. ఈ గీతాలాపనతో జాతీయ గీతంపై భక్తి పెరిగింది.

దోసపాటి శ్రీనివాస్, సహ అధ్యక్షుడు జనగణమన ఉత్సవ సమితి

ప్రజల నుంచి అపూర్వ స్పందన



నిత్యజాతీయ గీతాలాపన కార్యక్రమానికి ప్రజలు, యువత నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. గీతాలాపన ప్రారంభ సమయంలో పాదాచారులతో పాటు వాహనదారులు సైతం స్వీయ క్రమశిక్షణతో నిలబడి జాతీయగీతం ఆలపిస్తున్నారు.

కొలనుపాక రవికుమార్, జనగణమన ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి



నార్కట్‌పల్లిలోని నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద నిత్య జాతీయ గీతాలాపనలో పాల్గొన్న పౌరులు

నల్లగొండ స్ఫూర్తితో..

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నార్కట్‌పల్లి పట్టణంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం మూడేళ్లుగా కొనసాగుతోంది. నేటి యువతలో దేశభక్తిని, జాతీయ భావాన్ని మరింత పెంచే లక్ష్యంతో జగిత్యాల, నల్లగొండ, తిప్పర్తి తదితర పట్టణాల్లో కొన్నేళ్ల కిందటే జనగణమన కమిటీల ఆధ్వర్యంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం ప్రారంభమై నిర్విరామంగా కొనసాగుతోంది. ఈ విషయాన్ని ఆయా మార్గాల ద్వారా స్ఫూర్తి పొందిన కొందరు యువకులు నార్కట్‌పల్లి పట్టణంలోనూ నిత్య జాతీయ గీతాలాపనను ప్రారంభించాలని సంకల్పించారు. నల్లగొండలో ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్న కర్నాటి విజయ్‌కుమార్ బృందాన్ని సంప్రదించారు. అక్కడ నిర్వహిస్తున్న విధానాన్ని తెలుసుకుని 2022 ఆగస్టు 15న ఘనంగా ప్రారంభించి తమ సంకల్పానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆర్థిక, హార్థిక సహకారంతో మైకు సెట్‌లను ఏర్పాటుచేశారు. తొలుత పట్టణంలోని నాలుగు కూడళ్లలో నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. నల్లగొండ క్రాస్ రోడ్డు, బస్టాండ్, అమ్మనబోలు క్రాస్ రోడ్డు, మునుగోడు క్రాస్ రోడ్డు వద్ద ప్రతీ రోజూ ఉదయం 8.30 గంటలకు జాతీయ గీతాలాపనను విజయవంతం చేశారు. అంతకు ముందు దేశభక్తిని, స్వాతంత్ర్యోద్యమ త్యాగమూర్తులను గుర్తుచేస్తూ సాగే పాటలు వినిపిస్తాయి. అనంతరం 52 సెకన్ల నిడివిలో ఉండే జనగణమన జాతీయ గీతాలాపన అనంతరం జాతీయ గీతానికి వందన సమర్పణతో కార్యక్రమం ముగిస్తున్నారు. 2023 ఆగస్టు 15న మొదటి వార్షికోత్సవ వేడుకలను నార్కట్‌పల్లిలో ఆడంబరంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో ఆటంకం ఏర్పడి ఆరు నెలల పాటు నిలిపివేసిన ఈ నిత్య జాతీయ గీతాలాపన సంక్రాంతి నుంచి ప్రస్తుతం నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద పునఃప్రారంభమైంది. వయస్సు తారతమ్యం లేకుండా గీతాలాపన సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని నిర్వహకులను అభినందిస్తున్నారు.



కన్నెబోయిన నర్సింహ
జనగణమన కమిటీ అధ్యక్షుడు, నార్కట్‌పల్లి

జాతీయభావం పెంపొందించాలనే

నేటి తరంలో జాతీయ భావం పెంపొందించే సదాశయంతోనే నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి సంకల్పించాం. దేశభక్తి, జాతీయత కేవలం జాతీయ పండుగల రోజు మాత్రమే ప్రస్తావనకు వస్తుండగా తదుపరి ఆ ఊసే ఉండటం లేదు. దీంతో నిత్యగీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టాం. స్వాతంత్ర్య వీరులను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నాం.



బండారు రమేష్
స్థానిక వ్యాపారి

పౌరుడిగా కర్తవ్యంగా భావిస్తున్న..

నార్కట్‌పల్లిలో ప్రతి రోజూ నిర్వహించే నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి హాజరవుతున్నా. దేశభక్తిని, జాతీయభావాన్ని పెంపొందించే ఈ కార్యక్రమంలో పాల్గొనడం పౌరుడిగా నా కర్తవ్యంగా భావిస్తున్న. ఇలా అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తే నేటి తరంలో జాతీయ భావం దానంతటదే ప్రేరేపిస్తుంది. ఒక్క నిమిషం జాతీయ గీతాలాపనకు వీలైనంత మేరకు ప్రజలు సమయమివ్వాలి.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు పోచంపల్లి

చేనేత కళాకారులకు అవకాశం



గణతంత్ర వేడుకలకు హాజరయ్యేందుకు ఢిల్లీకి చేరుకున్న తెలంగాణ నుంచి ఎంపికైన చేనేత కళాకారులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ నెల 26న నిర్వహించే వేడుకలకు రాష్ట్రం నుంచి పలువురు చేనేత కళాకారులకు పాల్గొనే అవకాశం దక్కింది. అందులో యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి నుంచి చేనేత అవార్డు గ్రహీతలు ఎన్నం మాధవి శివకుమార్, తడక రమేష్, పుట్టపాక నుంచి రాపోలు బాలసుబ్రహ్మణ్యం, సిద్దిపేట నుంచి ఎస్ యశ్వంత్ తదితరులు ఆహ్వానం పొందారు. ఈ మేరకు వారు శనివారమే ఢిల్లీకి చేరుకున్నారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ డిపార్టుమెంట్ నిర్వహించే కార్యక్రమాల్లో వారు పాల్గొంటారు.

రూ.కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడి..

● ఆక్రమణలను అడ్డుకుంటున్న తహసీల్దార్ హరిబాబు
● మిర్యాలగూడ మండలంలో ఆక్రమిత ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ హరిబాబు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటే చూద్దాంలే అనే అధికారులను చూస్తున్న ప్రస్తుత సమాజంలో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని వెంటబడి కాపాడిన అధికారి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు. మిర్యాలగూడ మండలంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడటంలో హరిబాబు తీవ్రంగా శ్రమించారు. సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆధ్వర్యంలో ఎనిమిది స్థలాలను ప్రభుత్వ భూములుగా గుర్తించారు. ఎకరం రూ.5కోట్ల విలువ కలిగిన పట్టణ నడిబొడ్డులో ఉన్న మూడు ఎకరాలు, ఆలగడపలో రూ.40లక్షల విలువ గల భూమిని, తడమకళ్ల, ఇందిరమ్మ కాలనీలో, జప్తివీరప్పగూడెం, వెంకటాద్రిపాలెం తదితర గ్రామాల్లో లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు. 2023లో మిర్యాలగూడ తహసీల్దార్‌గా వచ్చిన హరిబాబు పనితీరు ఇతర అధికారులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఎన్నికల వేళ అన్నీ తానై...

ఇటీవల వరుస ఎన్నికలను అందరినీ సమన్వయం చేసుకుంటూ సజావుగా జరిగేలా చూసిన హరిబాబు పనితీరును ఉన్నతాధికారులు గుర్తించి అభినందించారు. ధరణి సమస్యలపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన సమయాన్ని పూర్తిగా కేటాయిస్తూ 6,300 భూసమస్యలను పరిష్కరించారు. ఉదయం ఎనిమిది గంటలకే విధుల్లోకి హాజరవుతుంటారు. సాయంత్రం 7గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న హరిబాబు 2007లో జూనియర్ అసిస్టెంట్‌గా మహబూబ్‌నగర్ జిల్లా తాడూరులో పనిచేశారు. 2012లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీఎస్‌గా తన విధులను నిర్వర్తించారు.



నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నుంచి అవార్డును అందుకుంటున్న హరిబాబు

● **తహసీల్దార్ హరిబాబుకు ఉత్తమ అవార్డు**

ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి రిమార్కులు లేకుండా పనిచేసినందుకు మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబుకు ఉత్తమ తహసీల్దార్ అవార్డును కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో సిబ్బంది, అన్ని పక్షాల నాయకుల సహకారంతో ఎన్నికలను ఎలాంటి విభేదాలు లేకుండా నిర్వహించడం జరిగిందన్నారు. తన పనితనాన్ని గుర్తించి కలెక్టర్ ఇలా త్రిపాఠి తనకు ఉత్తమ తహసీల్దార్ అవార్డును అందించడం ఆనందంగా ఉందన్నారు.

పెద్దగట్టుపై చిన్నచూపు

(5వ పేజీ తరువాయి)



పెద్దగట్టుపై మరుగుదొడ్ల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు

మరుగుదొడ్లు నిర్మించారు. జాతర సమయంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసి నిధులను వృథా చేస్తున్నారు. గుట్టపైన ఉత్తరం, దక్షిణం వైపు మరుగుదొడ్లు నిర్మించాలని భావించినా నిధులు లేక అడుగు ముందుకు పడడం లేదు. భక్తులు సేద తీరడానికి పెద్ద షెడ్ నిర్మాణం చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలోకి రాలేదు. గుడి చుట్టూ భక్తులు తిరగడానికి ఏర్పాటు చేసే చలువ పందిళ్ల కిందనే భక్తులు సేద తీరాల్సి వస్తోంది. వీటికి తోడు అక్కడక్కడ షామియానాలు ఏర్పాటుచేస్తున్నారు. వీటికి పెట్టే ఖర్చుకు తోడు కొంత ప్రభుత్వం నిధులు కేటాయిస్తే శాశ్వతంగా ఉండే షెడ్ నిర్మాణం చేయవచ్చని భక్తులు పేర్కొంటున్నారు. గుట్టపైన సహజంగా ఏర్పడిన కోనేరు చుట్టూ శాశ్వత నిర్మాణాలు లేవు. భక్తులు తలనీలాలు తీసుకున్న తర్వాత స్నానాలు చేయడానికి బాత్‌రూంలు సైతం శాశ్వతమైనవి లేవు. గుట్టపైకి రావడానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా నిధులు మంజూరు కాలేదు. గుట్టపైకి వచ్చే తూర్పు, పడమర వైపు ఉన్న మెట్ల వద్ద గోపురాలు నిర్మాణం చేస్తామన్న హామీ అమలు పర్చలేదు. కనీసం తాగునీటి సౌకర్యం లేదు. ఆలయ ఆస్తుల పరిరక్షణకు ఎటువంటి భద్రతా వ్యవస్థ లేకపోవడంతో ఉన్న మరుగుదొడ్ల డోర్లు, ఇతర సామాగ్రి కూడా చోరీకి గురైంది.

వేలం పాటల టెండర్లు పూర్తి

పెద్దగట్టు పైన,గుట్ట కింద భాగాల్లో మాత్రం వేలం పాటల టెండర్ ప్రక్రియను ముగించారు. దేవదాయశాఖ, మునిసిపాలిటీ శాఖలు టెండర్లు నిర్వహించాయి. దేవాదాయ శాఖకు కొబ్బరికాయలు విక్రయించే హక్కు, లడ్డూ, పులిహోర విక్రయ, తలనీలాల సేకరణ హక్కు, పచ్చి కొబ్బరికాయల సేకరణకు హక్కు మొత్తం కలిపి రూ.52 లక్షల పైచిలుకు ఆదాయం వచ్చింది. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలో ఎగ్జిబిషన్, చిరుదుకాణాల ఖాళీస్థలం, మిఠాయి, స్వీట్లు, వరిపేలాలు, బొంగులు, చెరుకు గడలు, జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు టెండర్ల ద్వారా రూ.68 లక్షల ఆదాయం వచ్చింది. జాతరకు వేలం పాటల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం రాగా ఎవర పరిధిలో వారు పనులకు ఖర్చు చేయనున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆరోసారి నిర్వహించే లింగమంతుల స్వామి జాతర విజయవంతంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాల్సి ఉంది. నిధుల కేటాయింపు ఇంకా లేకపోవడంతో పెద్దగట్టు వద్ద హడావుడి కనిపించడం లేదు. అడపాదడపా భక్తులే వచ్చిపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 5 జాతరలు నిర్వహించగా 6వ జాతరను కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వహించనుంది. నిధుల కేటాయింపునకు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు మంజూరైతేనే పనుల చేపట్టడానికి వెళ్తామని అధికారులు అంటున్నారు. లింగమంతుల జాతర తర్వాతే నిర్వహించే మేళ్లచెర్వు జాతరపై సమీక్ష నిర్వహించిన అధికారులు పెద్దగట్టు జాతరపై ఎందుకు సమీక్షించడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

గత జాతరకు రూ.5 కోట్లు

పెద్దగట్టు జాతరకు 2023లో అప్పటి ప్రభుత్వం నుంచి రూ.2.5 కోట్లు, మునిసిపాలిటీ శాఖ నుంచి రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. వీటితో రక్తం పీల్చే యంత్రంతో పాటు సోలార్ లైట్లు, విద్యుత్ లైన్లు, గుట్ట సమీపంలోని సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీనికి తోడు గుట్ట చుట్టూ ఉన్న సమీప గ్రామాలను అనుసంధానిస్తూ రహదారులకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు చేపట్టిన మార్గం గుండా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలను మళ్లించారు. అయితే అప్పటికప్పుడు చేపట్టిన పనులు కావడంతో కొద్దికాలానికే దెబ్బతిన్నాయి. వీటికి తోడు షామియానాలు, ఇతర తాత్కాలిక పనులు చేపట్టారు.

రూ.4.5 కోట్లతో పాలకవర్గం ప్రతిపాదనలు

జాతర సమీపిస్తుండటంతో నూతన పాలకవర్గం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పొన్నం ప్రభాకర్‌ను కలిసి నిధులు మంజూరు కోసం వినతిపత్రాలను అందజేసింది. పెద్దగట్టు సమీపంలో శాశ్వతంగా చేపట్టాల్సిన పనులను వారు వివరించారు. అందులో రూ.1.20 కోట్లతో భక్తులు సేదతీరేందుకు షెడ్‌నిర్మాణం, రూ.50 లక్షలతో శాశ్వత మరుగుదొడ్లు, రూ.1.20 కోట్లతో గుట్టపైకి ఘాట్‌రోడ్డు, గుట్టపైన కోనేరు విస్తరణకు రూ.30 లక్షలు, గుట్ట చుట్టూ ఉన్న రోడ్ల మరమ్మతులకు రూ.80 లక్షలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

మిర్యాలగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. తనకు వచ్చిన ఉద్యోగంలో జాయిన్ కాకుండానే ఫోన్‌పే ద్వారా జీతం డబ్బులు తన ఖాతాలో జమ కావడంతో అనుమానించిన నిరుద్యోగి వేముల వంశీ ఫిర్యాదుతో ముఠా మోసాలు వెలుగుచూశాయి. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల్ని మోసగిస్తున్న ఆరుగురిలో ఇరువురిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. స్థానిక వాసవీనగర్‌లో గ్రామీణ ఉద్యోగ సేవా కేంద్రం నిర్వహిస్తున్న రాళ్లపల్లి శ్రీధర్ కనగల్ మండలం పగిడిమర్రికి చెందిన సంపత్‌రెడ్డి వద్ద రూ.2.50 లక్షలు తీసుకుని కాంట్రాక్ట్ మాన్ పవర్ ఏజెన్సీ జాబ్ పేర నియామకపత్రాన్ని ఇచ్చారు. కాగా అతను ఉద్యోగానికి వెళ్లకుండానే శ్రీధర్ ఫోన్‌పే ద్వారా నెల జీతం చెల్లించడంతో అనుమానించిన సంపత్‌రెడ్డి తనతో పాటు హోంగార్డు ఉద్యోగానికి శ్రీధర్‌కు రూ.12 లక్షలు చెల్లించిన మిర్యాలగూడ వంశీకి తెలపడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కమీషన్ ఆశతో..

హైదరాబాద్‌కు చెందిన ఖాసీంకు రియల్‌ఎస్టేట్‌లో ఏపీ రాష్ట్రం నంద్యాలకు చెందిన రాసపుత్ర రాఘవేందర్ అలియాస్ రాజు, మిర్యాలగూడకు చెందిన రాళ్లపల్లి శ్రీధర్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన ఎడ్ల చంద్రయ్య, మిర్యాలగూడకు చెందిన రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మలతో పరిచయం ఏర్పడింది. మీరందరూ కలిసి జాబ్‌లు ఇప్పించే ఏజెన్సీ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అందుకు పర్మిషన్ ఇప్పిస్తానని ఖాసీం మిగతా వారిని ఒప్పించాడు. జాబ్‌ల కోసం వచ్చే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తే అందులో 10శాతం కమీషన్ ఇస్తానని ఆశ చూపించాడు. దీంతో హోంగార్డు జాబ్ కోసం మిర్యాలగూడలోని సుందర్‌నగర్‌కు చెందిన వంశీ వద్ద రూ.12 లక్షలు, మరో ముగ్గురి వద్ద రూ.6 లక్షల చొప్పున డబ్బులు తీసుకున్నారు. పలురకాల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మొత్తం తొమ్మిది మంది నిరుద్యోగుల నుంచి రూ.45.10 లక్షలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసులో ఏ-1 ఖాసీం, ఏ-4 ఎడ్ల చంద్రయ్య, ఏ-5 రాళ్లపల్లి నారాయణ, ఏ-6 రాళ్లపల్లి పార్వతమ్మలు పరారీలో ఉండగా ఏ-2 రాఘవేందర్, ఏ-3 శ్రీధర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. మిగతా నిందితులను తర్వలోనే పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి రూ.లక్ష నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు, నిరుద్యోగుల బయోడేటా దరఖాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేసును దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న ఇన్‌చార్జి సీఐ నాగార్జున, ఎస్ఐ సైదిరెడ్డిని డీఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో

వృద్ధురాలి ఆత్మహత్య

దేవరకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవితంపై విరక్తి చెంది నల్లగొండ జిల్లా దేవరకొండలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ పట్టణం అయ్యప్పనగర్‌కు చెందిన కంభంపాటి సాయమ్మ(80)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నిరంజన్ నాలుగు ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోడలు వద్దనే ఉంటు జీవనం సాగిస్తోంది. కుమారుడు మృతితో మానసిక వేదనకు గురైన సాయమ్మ దీనికి తోడు అనారోగ్యానికి గురికావడంతో జీవితంపై విరక్తి చెంది పట్టణ శివారులోని తుల్చమ్మ కుంటలోపడి మృతి చెందగా శనివారం గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మనవడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కొయ్యలగూడెంలో

రవితేజ అంత్యక్రియలు



రవితేజ(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో దుండగుల కాల్పులలో మృతి చెందిన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం వాసి కొయ్యడ రవి తేజ(27) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామంలో కుటుంబసభ్యులు, బంధువులు పూర్తిచేశారు. మృతదేహం అమెరికా నుంచి బయలుదేరింది. శనివారం రాత్రి ఢిల్లీకి చేరుకుంది. ఆదివారం తెల్లవారుజామున కొయ్యలగూడెం గ్రామానికి తీసుకురానున్నారు. రవితేజ తల్లితండ్రులు చంద్రమౌళి, సువర్ణ దంపతులు హైదరాబాద్‌లోనే ఉన్నారు. 2022లో అమెరికా వెళ్లిన రవితేజ ఉన్నత విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ వేటలో ఉన్నాడు. రవితేజ పార్ట్‌టైమ్ జాబ్‌గా ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న ఓ ఇంట్లో ఫుడ్ డెలివరి చేసి వస్తుండగా కనెక్టికట్ రాష్ట్రంలో ఇద్దరు దుండగులు రవితేజపై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవితేజ సోదరి కూడా అమెరికాలో చదువుకుంటోంది. రవితేజ మృతదేహంతో పాటు సోదరి కూడా వస్తుంది. తానా ప్రతినిధులు, భారత ప్రభుత్వం సహకారంతో మృతదేహం స్వదేశానికి తరలించారు. రవితేజ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నట్లు సమాచారం.

నమ్మించి నట్టేట ముంచి ఉడాయింపు

- వ్యాపారి జాడకోసం పోలీసుల ఆరా
- పోలీసులను ఆశ్రయించిన 200మంది బాధితులు
- గుట్ట పట్టణంలో గతంలోనూ మోసాల పరంపర

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): 'పొరుగింటి పుల్ల కూర భలే రుచి' అనే నానుడిని బేస్ చేసుకుని పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చి వ్యాపారాలను ఏర్పాటు చేసి, విశ్వాసంతో సేవలు అందిస్తున్నట్లు నమ్మబలికి కోట్ల రూపాయలు కొల్లగొట్టి అదృశ్యమైన వ్యాపారికి బలైన బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సంచలనాత్మక వ్యాఎరమోసాలకు కేంద్రంగా యాదగిరిగుట్ట పట్టణం మారింది. దినదినాభివృద్ధి చెందుతూ పర్యాటక కేంద్రంగా ఏర్పడిన యాదగిరిగుట్టకు రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు కిరాణం, జూవెల్లర్స్ వస్త్ర వ్యాపారులుగా అవతారం ఎత్తారు. పొరుగు రాష్ట్రాల వ్యాపారాలతో వ్యాపారుల వ్యవహార శైలి స్థానికులను ఎంతో ఆకట్టుకుంది. తమ వద్దకు వచ్చే ప్రజలను విశ్వాసంతో నమ్మించి వారి వద్ద నుంచి బంగారం నగలను తీసుకుని తాకట్టు రూపంలో లక్షలాది రూపాయలను ఇవ్వడం ప్రారంభించారు. ఇదే అదునుగా చేసుకుని మాటమాట కలిపి అధిక వడ్డీల వల విసురుతున్నారు. డబ్బులు తీసుకున్నవారు తిరిగి చెల్లించి తమ ఆభరణాలను తీసుకునే అవకాశం లేకుండా వ్యాపారి ఖేల్ ఖతం చేసి రాత్రికి రాత్రే అదృశ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎంతో కష్టపడి సంపాదించిన అధిక వడ్డీకి ఆశపడి అప్పులు, బంగారం తాకట్టుపెట్టి మోసమోయిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఇప్పటి వరకు స్థానిక పోలీసులకు 200మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

మోసాల పరంపర ఇలా..

తాజాగా యాదగిరిగుట్ట పట్టణంలో రాజస్థాన్‌కు చెందిన జితేందర్ సింగ్ రాథోడ్ అనే బంగారం తాకట్టు వ్యాపారి గత 15 సంవత్సరాల క్రితం గుట్టకు వలస వచ్చి ముందుగా దుర్గా జూవెల్లర్స్‌లో పనిచేశాడు. కొంత కాలం గడిచిన తరువాత జితేందర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి కిరాణం దుకాణం సొంతంగా ఏర్పాడు చేసుకుని ప్రజలకు మరింత చేరువయ్యాడు. అప్పటి నుంచి తన వ్యాపారంతో ప్రజలను నమ్మించి అప్పులు



గుట్టలోని బంగారు ఆభరణాల దుకాణం, వ్యాపారి జితేందర్‌సింగ్ రాథోడ్(ఫైల్ ఫొటో)

తీసుకోవడం మొదలు పెట్టాడు. ఇటీవల సొంతంగా గుట్టలోనే మెయిన్ రోడ్డు పక్కల 80గజాల విస్తీర్ణం గజం రూ.1లక్షతో 80లక్షలకు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఎత్తున బంగారం తాకట్టు వ్యాపారం, జూవెల్లర్స్ వ్యాపారం ప్రారంభించాడు. దీంతో ప్రజలకు పూర్తిగా నమ్మకంగా కలిపించారు. స్థానికులు వేర్వురుగా సమారు మూడు కేజీల 20గ్రాముల వరకు బంగారం ఆభరణాలు తాకట్టు పెట్టుకొని, రూ.కోటీ 20లక్షల వరకు వడ్డికి ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. మరోవైపు స్థానికుల వద్ద కోట్ల రూపాయలను అప్పుగా తీసుకొని అధిక వడ్డీ నెలవారిగా ఇస్తూ ప్రజలను నమ్మించాడు. వారం రోజుల క్రితం తన వద్ద తాకట్టుపెట్టిన నగలు తీసుకుని వెళ్లానని, డబ్బులు చెల్లించాలని ఫోన్ ద్వారా సమచారం అందించి తెలివిగా డబ్బులు కట్టించుకున్నాడు. బంగారం బ్యాంకులో ఉందని రెండు రోజుల్లో వచ్చి తీసుకెళ్లాలని సూచించాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి రాత్రికే పరారయ్యాడు. మరుసటి రోజు దుకాణం వద్దకు బంగారం తీసుకోవడానికి వచ్చిన బాధితులకు దుకాణం తాళం వేసి ఉండటంతో బాధితులు ఫోన్‌చేశారు. స్విచ్ ఆఫ్ రావడంతో సమాచారం పట్టణంలో దావనంలా ప్రవహించింది. దీంతో బాధితులు దుకాణం ఎదుట రాత్రి 8గంటల వరకు ఆందోళన చేసి పోలీసులను ఆశ్రయించారు.

● 2010 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన అర్జున్ అనే వ్యక్తి వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకొని స్థానిక ప్రజలను నమ్మించి వారి వద్దనుంచి డబ్బులను వడ్డీకి తీసుకొని సుమారు రూ. 5కోట్ల రూపాయలతో ఉడాయించాడు.

● 2022 సంవత్సరంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరోవ్యక్తి పలని అనే వస్త్ర వ్యాపారి పట్టణంలో సుమారు 10సంవత్సరాలుగా వ్యాపారం చేస్తూ ప్రజలు పూర్తిగా నమ్మే విధంగా నూతన వస్త్రాలను తీసుకు వచ్చి, మహిళలను నమ్మించాడు. తమ వ్యాపారం నిమిత్తం అధిక వడ్డీ ఇస్తానని స్థానికులను మచ్చిక చేసికుని సుమారు రూ. 6కోట్లతో ఉడాయించాడు.

● 2023 సంవత్సరంలో పట్టణంలో నివాసం ఉంటున్న ట్రాన్స్‌జెండర్ స్థానికుల వద్ద డబ్బులను అధిక వడ్డీ ఇస్తానని, మరోవైపు చిట్టీల వ్యాపారం చేసి సుమారు రూ. 3కోట్ల వరకు డబ్బులు దండుకొని పారిపోయింది.

ఇప్పటి వరకు పట్టణంలో నలుగురు వ్యక్తులు కోట్ల రూపాయాల నగదు... బంగారం దండుకొని ప్రజలకు కుచ్చుటోపీ పెట్టారు. గుట్టలో ఇలాంటి మోసాలు వరుసగా జరుగడంతో ప్రజలు లబోదబోమంటున్నారు. ప్రజల ఆశ- నమ్మకాన్ని ఆసరా చేసుకుని బరిడీ బిజినెస్ చేస్తున్న ఇలాంటి వ్యాపారుల పట్ల పారాహుషార్ ...! అంటూ పలురురు హెచ్చరిస్తున్నారు. అతి విశ్వాసంతో నమ్మి ఉన్నదంత కోల్పోతున్న భాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగకుండా అవగాహనతో కూడిన చైతన్య కార్యక్రమాలను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సామాజిక సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేయాలని పలువురు కోరుతున్నారు.

బాధితులను ఆదుకుంటాం: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



పట్టణంలో బంగారు తాకట్టు వ్యాపారం మేరుతో ప్రజలను నమ్మించి కోట్ల రూపాయలను దండుకుని, మోసంచేసి పారిపోయిన జితేంద్‌సింగ్ రాథోడ్‌ను తప్పకుండా పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తాం. వ్యాపారికి సబంధించిన పట్టణంలో ఇతర దుకాణాలకు చెందిన నలుగురు యజమానుల దుకాణాలకు తాళం వేయాలని పోలీసులను ఆదేశించాం. వారి జాడతెలిపే వరకు దుకాణాలు తెరిచేది లేదని వ్యాపారికోసం డీసీపీ, ఏసీపీలతో మాట్లాడి ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశాం. పాస్‌పోర్టు తీసుకొని ఇతర దేశాలకు వెళుతున్నట్లు సమాచారం వచ్చిందని వెంటనే, పాస్‌పోర్టును రద్దుచేయాలని సబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

యాదగిరీశుడికి ఏకాదశి పూజలు

● భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన

భువనగిరి అర్బన్, జనవరి 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించి అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ పుష్పమాలికలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమనరీతిలో గంటపాటు పూజ పర్వం కొనసాగింది.


లక్ష పుష్పార్చనలో లక్ష్మీనారసింహుడు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామి వారి సన్నిధిలో శనివారం స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొపిన అర్చకులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువు స్వామి, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారలను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక తీర్చిదిద్ది సుదర్శన శతకపఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో దర్బార్ సేవోత్సవం చేపట్టిన పూజారులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు, రుద్రహవన పూజలు శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,09,312 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆలయం ఉత్తరవీధిలో రూ. 150 లడ్డు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. రోజు రోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా కొత్తగా లడ్డు కౌంటర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఈవో తెలిపారు.

మత్స్యగిరీశుడి సన్నిధిలో కేంద్ర అడిషనల్ డైరెక్టర్


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

వలిగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామిని అడిషనల్ డైరెక్టర్ గౌవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ డాక్టర్ సంతోష్‌కుమార్ పాండే శనివారం దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి జ్ఞాపికను, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ముఖ్య నిర్వాహణ అధికారి మోహన్‌బాబు, ధర్మకర్తలు, జగన్, మోహన్‌రెడ్డి రాములు, అమరేందర్, ప్రభాకర్, ఉషయ్య, బాలేశ్వర్, అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని విడనాడితే ప్రశాంతత

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితంలో నేర ప్రవృత్తిని విడనాడి సత్‌ప్రవర్తనను పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి సబ్ జైలులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. నేర స్వభావంతో వ్యక్తిగతంగా, కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని గ్రహించాలని సూచించారు. వివిధ కేసుల్లో జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు ఆరుగురు న్యాయవాదులతో కూడిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టెం న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఖైదీలకు రాజ్యాంగ హక్కులు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ కార్యదర్శి వి.మాధవీలత, న్యాయమూర్తులు ఎస్.శ్యాంసుందర్, జి కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్, చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్ జైపాల్, జైల్ సూపరింటెండెంట్ నెహ్రూ తదితరలు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలు తగలబెట్టిన అమ్రాబాద్ అటవీ అధికారులు

● మత్స్యకారుల గుడిసెలు పీకేసిన వైనం ● తమకు న్యాయం చేయాలని మత్స్యకారుల విన్నపం

నాగార్జునసాగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులపై అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు జులుం చూపించారు. కృష్ణమ్మ తల్లిని నమ్ముకొని చేపల వేటను తమ జీవనాధారంగా కొనసాగిస్తూ బతుకుతున్న మత్స్యకారుల వలలు, తగలబెట్టి, గుడిసెలు తొలగించారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం గద్దల చెరువు ఆలటం, ఏడు వంపుల తొట్టి, మోలరేవు ప్రాంతంలో జరిగింది. ఈ ప్రాంతం అటు ఏపీలో వెల్దుర్తి మండలంలో ఇటు తెలంగాణలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో నదికి ఇరువైపుల అటువైపు, ఇటు తెలంగాణ మత్స్యకారులు పుట్టీలలో నదిలో విహరిస్తూ వలలు వేస్తూ చేపల వేటను కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అటవీ అధికారులైన బీట్ ఆఫీసర్, 15 మంది గార్డులు, సెక్షన్ ఆఫీసర్ జలాశయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నది ఒడ్డున ఉన్న మత్స్యకారుల వద్దకు వచ్చి ఇక్కడ నుంచి గుడిసెలు, వలలు తీసివేయాలని హెచ్చరించారు. అలా చెప్పి వెళ్లిన అటవీ శాఖ అధికారులు అరగంటలోనే మళ్లీ మత్స్యకారుల వద్దకు వచ్చి మీరు ఇంత వరకు ఎందుకు గుడిసెలు, వలలు తీసేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారని, ముగ్గురిని కొట్టారని మత్స్యకారులు వాపోయారు. అంతటితో ఆగకుండా గుడిసెలను పీకేసి, వలలను తగులబెట్టారన్నారు. తమకు న్యాయం చేసి అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.


అటవీశాఖ అధికారులు తగలబెట్టిన మత్స్యకారుల వలలు

విదేశీ ప్రతినిధుల సందడి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చేనేత రంగం పరిస్థితులను అధ్యయనం చేసేందుకు అమెరికా సంయుక్త రాష్ట్రానికి (యూఎస్ఏ) చెందిన వాషింగ్టన్ డీసీలో ప్రొఫెసర్‌గా, ఫొటో గ్రాఫర్‌గా పనిచేస్తున్న నేవిల్ శనివారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి సందర్శించారు. హైదరాబాద్‌లోని షైవే అర్గనైజే షన్ టూరిస్ట్ గైడ్ విడితి చౌదరి ఆధ్వర్యంలో యూఎస్ఏ ప్రతి నిధులు ఇక్కడికి వచ్చారు. పట్టణంలోని కళా పునర్వి చేనేత యూనిట్‌ను సందర్శించి కార్మికుల చేనేత పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామీణ పర్యాటక కేంద్రంలోని మ్యూజియం సందర్శించి టీవ్‌టుక్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌లో కార్మికులు రూపొందించే కళాత్మాక వస్త్రాలను పరిశీలించారు. చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను వారు అధ్యయనం చేశారు.


చేనేత కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

53 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దఅడిశర్లపల్లి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఎర్రగుంటతండా, తిరుమలగిరి గ్రామాల్లో రేషన్ డీలర్ల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, గుడిపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆర్ఐసీఎస్ సైదులు వివరాల ప్రకారం... మండలంలోని ఎర్రగుంటతండా, తిరుమలగిరి రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యాన్ని దాచి ఉంచారనే సమాచారం మేరకు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, పోలీసులు దాడి చేశారు. రెండు షాపుల్లో కలిపి 53.5 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



చిట్యాలరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదిరిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా గోకారం గ్రామానికి చెందిన దేశపాక ముత్తయ్య(60) తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై వెలిమినేడు శివారులోని శుభం గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ నుంచి పిట్టంపల్లి క్రాస్ రోడ్డు వద్ద వెలిమినేడు గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. హైదరాబాద్ నుంచి వచ్చే కారు ముత్తయ్య ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముత్తయ్యకు తీవ్రగాయాలై రోడ్డుపై అపస్మారకస్థితిలో పడిపోయాడు. అదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాహనశ్రేణికి ఎస్కాట్‌గా వెళ్లి చిట్యాలకు వెళ్తున్న చిట్యాల ఎస్ఐ ప్రమాదాన్ని గమనించి ముత్తయ్యను బతికించేందుకు వెంటనే ఎస్ఐ ధర్మ సీపీఆర్ చేయగా అయినా ఆయనలో చలనం లేకపోవడంతో మృతిచెందాడని నిర్ధారించారు. చిట్యాల పోలీసులు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ధర్మ తెలిపారు.

చెర్వుగట్టు జాతర ఏర్పాట్లు షురూ

నార్కట్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు షురూ అయ్యాయి. ఈ నెల 16వ తేదీన నిర్వహించిన స మన్వయ సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికార యంత్రాంగం ఇప్పటికే దృష్టి సారించింది. ప్రచార కార్యక్రమాలను ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా ప్రారంభించగా ఉమ్మడి జిల్లాతో పాటు చెర్వుగట్టుకు అ త్యధికంగా భక్తులు వచ్చే ప్రాంతాల్లో ప్రచారరథాలను పంపారు. ఆయా ముఖ్య పట్టణాల్లో పోస్టర్లు అంటించే పనులు చేపట్టారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐలు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతాయని భావిస్తున్న దుకాణదారులను తమ షాపుల ముందు వేసిన రేకులను వెనక్కి జరుపుకోవాలని హెచ్చరించారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చెర్వుగట్టుకు నలువైపులా ఉన్న రోడ్లపై మట్టితో చదును చేసే పనులను ప్రారంభించారు. బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంటలకు ప్యాచ్ వర్క్ పనులను కొనసాగిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో వచ్చే వాహనాల పార్కింగ్ కోసం ఎంపిక చేసిన స్థలాలను పోలీసులు, దేవస్థానం అధికారులు పరిశీలించారు. ప్రముఖులకు బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికలను అందజేయనున్నారు.


చెర్వుగట్టులో మట్టితో రోడ్లను చదును చేస్తున్న సిబ్బంది

బీడబ్ల్యూఎఫ్ కోచింగ్‌కు రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) కోచింగ్‌కు ఎంపికయ్యారు. డీఏఎపీ జిల్లా కోచ్‌గా వ్యవహరిస్తున్న రామకృష్ణ బీడబ్ల్యూఎఫ్ కోచర్స్ శిక్షణకు ఎంపికైనట్లు స్టేట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ బీడబ్ల్యూఎఫ్ కోచింగ్‌కు ఎంపిక చేసిన ఇండియన్ సీనియర్ ప్లేయర్, అకాడమీ వ్యవస్థాపకుడు పుల్లెల గోపీచంద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపిచంద్

పర్యాటకరంగంతో సుస్థిర అభివృద్ధి


● డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

నల్లగొండటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంతో అపారమైన సుస్థిర అభివృద్ధి - వ్యాపార అవకాశాలు ఉంటాయని ప్రముఖ చరిత్రకారుడు, పురావస్తు శాస్త్రజ్ఞుడు స్తపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పర్యాటక దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటకరంగం అపారమైన అవకాశాలతో పాటు సుస్థిర అభివృద్ధికి సైతం బాటలు వేస్తుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భిన్న భౌగోళిక, చారిత్రక ప్రదేశాలు ఉన్న కారణంగా అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకరంగం స్వతహాగా అవకాశాలను ఏర్పర్చుకుంటూ వినోదం, ఆహ్లాదం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికత, ఆరోగ్యం వంటి భిన్న ప్రయోజనాలు రంగాల్లో విస్తరిస్తుందన్నారు. డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ సబీనా హెరాల్డ్, డాక్టర్ మిరియాల రమేష్, డాక్టర్ లక్ష్మీప్రభ, డాక్టర్ సూరంశ్వేత, డాక్టర్ ప్రవళిక, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

గుండ్రాంపల్లిలో 4 వేల ఏళ్ల నాటి రాతిగొడ్డలి లభ్యం

చిట్యాలరూరల్: పురాతన వారసత్వ చారిత్రక సంపదను సంరక్షించుకోవాలని ప్లీచ్ ఇండియా సీఈవో, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ప్రిజర్వ్ హెరిటేజ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో గుండ్రాంపల్లి-ఏపూర్ గ్రామాల నడుమ ఉన్న నాగులకట్ట వద్ద చేపట్టిన అన్వేషణలో పురాతన రాతి గొడ్డలి, కాకతీయుల కాలం 13వ శతాబ్దం నాటి దేవతల విగ్రహాలు లభ్యమైనట్లు ఆయన తెలిపారు. రాతిగొడ్డలిని, విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతనమైన కొన్ని వందల సంవత్సరాల క్రితం వి గ్రహాలు వస్తువులను కాపాడుకోవాలని అన్నారు. క్రీ.పూ. 4 వేల ఏళ్ల నాటి రాతి గొడ్డలి లభ్యం కావడం ఎంతో అదృష్టమని, వాటిని చూస్తే ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. పురాతన దేవాలయాలు విగ్రహాల పరిశోధనలో భాగంగా గుండ్రాంపల్లి శివారులో పురాతన ఆలయం విగ్రహాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు పరిశీలించగా క్రీ.పూ.4వేల ఏళ్ల రాతి గొడ్డలి లభించిందన్నారు. 15 సెం.మీ పొడవు, 5 సెం.మీ. వెడల్పు, 2 సెం.మీ మం దమున్న నల్లసానపు రాతిగొడ్డలి ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా కాకతీయుల కాలం నాటి క్రీ.శ.13వ శతాబ్దం నాటి అద్భుతమైన నాగదేవతల శిల్పాలు కూడా ఉన్నాయన్నారు. విగ్రహాలు సంరక్షణ లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పురాతనమైన వారసత్వ చారిత్రక సంపదను, శిల్పాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట వారసత్వ కార్యకర్త యడ్లపల్లి అమర్నాథ్ ఉన్నారు.


గుండ్రాంపల్లిలో కొత్త రాతియుగపు ఆనవాళ్ల గొడ్డలిని చూపుతున్న శివనాగిరెడ్డి

ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్‌కుమార్



ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

నల్లగొండటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇమ్మిడిశెట్టి ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఇమ్మిడిశెట్టి ఉదయ్‌కుమార్, కార్యదర్శిగా మహమ్మద్ ఇలియాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ నెదునూరి మహేష్, ఉపాధ్యక్షులు ఫణి రాజశేఖర్, సతీష్‌ప్రసాద్, కోశాధికారి అశోక్, మహిళా కార్యదర్శి మణి, ఈసీ సభ్యులుగా కవిత, మౌనిక ఎన్నికయ్యారు. ఈ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నాగిళ్ల మురళి, శేఖర్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీజీవోస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఎండీ మహబూబ్, ఎండీ జాకీర్ పాల్గొన్నారు.

బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికైన విజయ్



అవార్డు అందుకుంటున్న ఎన్నికల విభాగం డీటీ విజయ్

నల్లగొండ టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా జిల్లా నుంచి కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న విజయ్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ అందజేశారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు భవిష్యత్తు



సభలో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

శాలిగౌరారం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేస్తే మాదిగలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెస్పీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతులు రథయాత్ర రాత్రి శాలిగౌరారం మండలం కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వర్గీకరణ అమలుచేయాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతులు మండే మాదిగల గుండెచప్పుడు మహా ప్రదర్శనకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు జమ్ము రమేష్, ఎరుకుల సంఘం జిల్లా నాయకులు కూతాటి సోమయ్య, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సుల్తాన్ వెంకన్న, కల్లూరి నాగరాజు, బొల్లికొండ గణేష్, ఆంజనేయులు, కారుపాటి అంబేడ్కర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ కళాకారుల కవాతు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కాటపాక శంకర్, గాయకురాలు చెరుకు మల్లిక, పాలడుగు అంజి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన గీత పనివారుల సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్ల పైనుంచి పడితే పాత పద్ధతితో మెడికల్ సర్టిఫికెట్ ద్వారానే పర్మినెంట్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ అర్హులైన గీత కార్మికులకు వృత్తి పింఛన్ మంజూరు చేయాలని, ప్రతీ గీతకార్మికుడికి చెట్టు ఎక్కేందుకు యంత్రాలను అందజేయాలని కోరారు. సమావేశం అనంతరం గీత పనివరాల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆ సంఘం సహాయ కార్యదర్శి పల్లె శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు లాలు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు సైదిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, తిప్పర్తి, చిట్యాల, మర్రిగూడ, కేతేపల్లి, కట్టంగూరు, నకిరేకల్, నల్లగొండరూరల్, కనగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైనదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆమె పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడే ఎన్నికల్లో నామినేషన్ ప్రారంభం నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా పనిచేస్తుందన్నారు. మన దేశంలో పూర్తి పారదర్శకతతో జరిగే ఎన్నికల ప్రక్రియ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఓటు అనేది పౌరుడి హక్కు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమని తెలిపారు. ఓటు అనేది ప్రతి పౌరుడి హక్కు, అది సరైన విధంగా ఉపయోగించుకొని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారితో ఓటు హక్కుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తిలో తహసీల్దార్ డి.స్వప్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ బీఎల్‌వోగా ఎంపికైన తిప్పర్తి అంగన్‌వాడీ కార్యకర్త జానమ్మను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ అబేదాబేగం, ఆర్ఐ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు సదానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● చిట్యాల పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు తహసీల్దార్ కృష్ణ బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా హైస్కూల్ హెచ్‌ఎం కళా శ్రీనివాస్ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో మాస బాలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేతేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కేతేపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఆర్ఐ చాంద్‌పాషా, ఎంపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● కట్టంగూరులోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చలపతి, ఏపీవో రాంమోహన్, కార్యదర్శి వడ్లకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య మాట్లాడారు. ఓటరుగా ప్రజలకు సేవ చేసే నాయకులు, పార్టీలు మాత్రమే గెలిచేలా యువత తమ చైతన్యాన్ని ఎన్నికల్లో ప్రదర్శించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు, చరిత్ర అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హరిత, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, శ్రీనివాసచారి, శంకర్, శ్రీనివాస్, ఉపేందర్, శివశంకర్, నర్సింహాచారి, కార్యాలయ సిబ్బంది వెంకన్న, సయ్యద్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

● నల్లగొండ జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల్లో కస్టమర్లతో పాటు, మీసేవ నిర్వాహకులు శనివారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు కోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ బూతుల వారీగా మహిళా ఓటర్లకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు పొందిన యువ ఓటర్లకు వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉత్తమ బీఎల్‌వోలుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీటీ పార్వతమ్మ, ఆర్ఐలు సునీత, యాదగిరి, విఘ్నేశ్వర్‌రెడ్డి, లతీఫ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాణోతు సుధాకర్, ఎంఈవో సైదులు, ప్రిన్సిపాల్ ప్రభంజన్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కనగల్‌లో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అధికారులు

ఉత్తమ బీఎల్‌వోగా పద్మ

చిట్యాలరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడుకు చెందిన బీఎల్‌వో పైళ్ల పద్మ ఉత్తమ బీఎల్‌వోగా ఎంపికయ్యారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పద్మకు అవార్డును అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ బీఎల్‌వోగా పద్మ ఎంపికైంది. బీఎల్‌వోగా సేవలందించినందుకు పద్మకు కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

కేశవరావుజాదవ్ జయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

మర్రిగూడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేశవరావు జాదవ్ జయంతి సభ పోస్టర్‌ను మర్రిగూడ అమరవీరుల ఆశయ సాధన సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొలుకులపల్లి యాదయ్య ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో గల భారత డిగ్రీ కళాశాల నారయణగూడలో నిర్వహించే కేశవరావు జాదవ్ జయంతికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముత్యాలుగౌడ్, పగడాల లింగయ్య, రాములు, నరసింహ, ఇబ్రహీం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చదువుతూ 9, 10 తరగతులలో బడి మానేసిన వారు, టెన్త్ పాసై ఇంటర్ కాలేజీకి వెళ్లని వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టీవోఎస్ఎస్) వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆగిపోయిన వారు ఉన్నత విద్యను అభ్యసించే వీలును కల్పించిందని తెలిపారు. ఆసక్తి గల వారు 29వ తేదీ వరకు మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పదవులకు దూరమైనా ప్రజల్లోనే ఉండాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం



మునిసిపల్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): పదవులకు దూరమైనా నిరంతరం ప్రజాసేవలోనే ఉండాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. చిట్యాల మునిసిపల్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో శనివారం నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా రాణించాలనుకునే వారు పదవి ఉన్నా, లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉంటే మళ్లీ అవకాశాలు వస్తాయన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండటం కత్తిమీద సాము లాంటిదని, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. ఐదేళ్లు మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని ఆయన అభినందించి సత్కరించారు. అంతకుముందు ఆయన పట్టణంలో అమృత్‌స్కీం కింద ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటిరెడ్డి, వైస్‌చైర్మన్ కూరెల్ల లింగస్వామి, మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద, కమిషనర్ వీరేందర్ కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, జమాండ్ల జయమ్మ, జడల పూలమ్మ, పందిరి గీత, జిట్ట పద్మ, బెల్లి సత్తయ్య, సిలివేరు మౌనిక, రెమిడాల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

● ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ అధికారులు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

కనగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. ఆలయంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను వారు పరిశీలించారు. సుమారు 4 కోట్ల నిధులతో ఆలయ విస్తరణ పనులను చేపట్టి అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా శనివారం దేవాదాయశాఖ రాష్ట్ర స్థపతులు శ్రీవల్లి నాయర్, అసిస్టెంట్ స్థపతి గణేష్, హైదరాబాద్ ఎండోమెంట్ చీఫ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, ఏఈ కిరణ్ ఆలయాన్ని సందర్శించారు. కోరిన కోర్కెలు నెరవేర్చుతూ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి మంత్రి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య, మాజీ చైర్మన్ దేప కరుణాకర్‌రెడ్డి, చెనగోని నగేష్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య, జేఏ ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బడి బయట పిల్లల గుర్తింపు సర్వే

శాలిగౌరారం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో వివిధ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖ ఆదేశాల మేరకు సీఆర్పీలు చేస్తున్న సర్వే శనివారంతో ముగిసింది. ఈ సర్వేలో 20 మందిని గుర్తించామని ఎంఈవో మండల సైదులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 6 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 19 సంవత్సరాలలోపు బడి మానేసి బయట తిరిగి పిల్లలను, బాల కార్మికులను గుర్తించడానికి క్షేత్ర స్థాయిలో పర్యటించినట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి మొదలైన సర్వే శనివారంతో ముగిసిందన్నారు. ఎవరైనా బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మెలుగూరి కృష్ణ, వేముల నాగయ్య, ఉయ్యాల లింగయ్య, ఐఈఆర్పీలు చిత్తలూరు బిక్షమయ్య, కొండ గీత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అత్యంత పవిత్రమైనది : బీజేపీ

రామగిరి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం అత్యంత పవిత్రమైనదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్ విధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ 2017 నవంబరు 26న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ గౌరవార్థం పంచతీర్థాల అభివృద్ధితో పాటు అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాల అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మాదగాని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, నూకల నర్సింహ్మారెడ్డి, బండారు ప్రసాద్, సాదినేని శ్రీనివాస్, లాలూనాయిక్, పిల్లి రామరాజు, నకిరేకంటి మొగిలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : నర్సిరెడ్డి

మునుగోడురూరల్, కనగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని, సమయం వృథా చేయకుండా చదవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. మునుగోడు మండలంలోని కొంపల్లి జడ్పీ హైస్కూల్, పలివెల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంపల్లి పాఠశాలలో తన నిధులు రూ. 23లక్షలతో తరగతి గదుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆ గదులను త్వరలోనే ప్రారంభించి విద్యార్థులు ఉపయోగించుకునే విధంగా చూస్తామన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అభ్యర్థిలో రెండోసారి బరిలో ఉన్న తనను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గేర నరసింహ, మునుగోడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాములు, పెరిక నర్సింహ, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని జీఎడవల్లి, కనగల్ ఉన్నత పాఠశాలను ఎన్నికల ప్రచారంలో భాగంగా సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పగిళ్ల సైదులు, సయ్యద్ అహ్మద్, రవీందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ డ్రామాలు

నాంపల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే రేవంత్ సర్కార్ ప్రజాపాలనలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను మభ్యపెడుతుందని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పోలగోని శ్రీకాంత్‌గౌడ్, నాంపల్లి శంకర్, కొత్తగొల్ల కొండల్, సైదయ్య పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎల్‌ఎఫ్ లక్ష్యం

చిట్యాల: రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం సాధించడమే బీఎల్‌ఎఫ్ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. శనివారం చిట్యాలలో బీఎల్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 97శాతం ఉన్న బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు అధికారం రావడానికి బీఎల్‌ఎఫ్ కృషి చేస్తుందన్నారు. కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లో లక్ష మందితో బహుజనుల గర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేశపాక సైదులు, గోపాల్, యాదయ్య, లింగస్వామి, సంజీవ, శ్రీరాములు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

'బాధితులపై కేసు నమోదు చేయవద్దు'

చిట్యాల, జనవరి25(ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిపై కేసు నమోదు చేయవద్దని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. మండలంలోని వనిపాకల గ్రామంలో ఈ నెల 23వ తేదీన జరిగిన ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేయవద్దని, ఒకవేళ నమోదు చేస్తే ఉపసంహరించుకోవాలని అన్నారు. శనివారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన నాంపల్లి సీఐ రాజశేఖర్‌ని, ఎస్ఐ ధర్మను కోరారు. వారు దానికి నిరాకరించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఎక్కువ సేపు ఉండవద్దని సూచించగా ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే కూర్చున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గుమిగూడుతుండగా సీఐ, ఎస్ఐ వచ్చి డీఎస్పీ శివరాంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పడంతో మాజీ ఎమ్మెల్యే అక్కడి నుంచి నిష్క్రమించారు. నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు సుంకరి యాదగిరి, కొలను వెంకటేష్, కందాటి రమేష్‌రెడ్డి, సైదులు, నర్సింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

కేతేపల్లి: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకొచ్చి సహకరించాలని బీమారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.భిక్షమయ్య కోరారు. పాఠశాలకు చెందిన 93 మంది విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ సమకూర్చిన దాదాపు రూ.10వేల విలువైన నోటు పుస్తకాలు, జాతీయ నాయకులు చిత్రపటాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బి.జానకిరెడ్డి పాల్గొన్నారు.

పసునూరు చెరువును పునర్నిర్మాణం చేయాలి

నాంపల్లి: మండలంలోని పసునూరులో గల పెద్ద చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి పునర్నిర్మాణం చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజాచారి అన్నారు. గతంలో వెయ్యి ఎకరాలకు సాగునీరందించిన చెరువు కబ్జాకు గురైందని అన్నారు.

వరంగల్‌కు దీటుగా అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ సందర్భంగా ఇబ్బందులు ఎదురవకుండా వీలైనన్ని ఎక్కువ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేవలం వంద రోజుల్లో బీటీ మార్కెట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మునుగోడు రోడ్డు, దేవరకొండ రోడ్డు, పానగల్ సావర్కర్‌నగర్, శివాజీనగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తే పట్టణానికి ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించవచ్చన్నారు. బ్రాహ్మణవెల్లంల రిజర్వాయర్‌ను నీళ్లతో నింపి కాల్వల ద్వారా నీరు అందిస్తున్నందున ఆ ప్రాంతంలో విద్యుత్‌కు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ అధికారులు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. నల్లగొండ మున్సిపాలిటీలో ఏడాది కాలంలో రూ.500కోట్ల రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో రూ.109కోట్ల పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, విద్యుత్ శాఖ సీఈ బాలస్వామి, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోగుల ప్రాణాలను కాపాడేది డాక్టర్లు మాత్రమే....

నల్లగొండ టౌన్: రోగుల ప్రాణాలను కాపాడేది డాక్టర్లు మాత్రమేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మంచి వైద్య సేవలందించాలని సూచించారు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే అవసరమైతే కాంటాక్ట్ పద్ధతిన భర్తీ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ పట్టణంలో సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

తిప్పర్తి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన దివంగత నాయకుడు కొంద్ర సైదులు విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మరో రెండు రోజుల్లో రైతుభరోసా ప్రతి రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని తానేదార్‌పల్లి, ఖాజీరామారం గ్రామాలకు నల్లగొండ నుంచి వచ్చి వెళ్లేందుకు రోడ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్లలో శ్రీశైలం సొరంగమార్గం పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం తన కల అని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జూకూరి రమేష్, నాయకులు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.149	235	265
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 కనిష్ఠం 16.0

జన.. ఘన.. మననం

- నిత్యం జాతీయ గీతాలాపన
- ఉదయం 8.30 గంటలకు కూడళ్లలోని మైకుల్లో
- నాలుగేళ్ల కిందట నల్లగొండలో ప్రారంభం
- కొన్నాళ్లుగా నార్కట్‌పల్లి, తిప్పర్తి, త్రిపురారంలోనూ..
- స్ఫూర్తిగా నిలిచిన కార్యక్రమం

చాలామంది బాల్యంలో పంద్రాగస్టు, రిపబ్లిక్‌డే సందర్భంగా జాతీయ గీతాలాపన చేసి వందనం చేసి ఉంటారు. కానీ, నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాత్రం నిత్యం జాతీయగీతాలాపన చేస్తుంటారు. అదీనూ ఒకే సమయంలో.. ప్రజల్లో జాతీయతను పెంపొందించేందుకు జనగణమన కమిటీలు ఏర్పాటు చేసుకుని కూడళ్లలో జాతీయ గీతాన్ని వినిపిస్తున్నారు. ఇలా నాలుగేళ్ల కిందట నల్లగొండ జిల్లా కేంద్రంలోని 12 కూడళ్లలో మొదలైన ఈ కార్యక్రమం మరో మూడు మండల కేంద్రాల్లో చేపట్టేందుకు స్ఫూర్తిగా నిలిచింది.

•6లో..


నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో జనగణమన ఆలాపన చేస్తున్న జనగణమన కమిటీ సభ్యులు



పెద్దగట్టుపై చిన్నచూపు

రాష్ట్రంలో సమ్మక్క సారక్క తర్వాత పెద్దగట్టు జాతర (లింగమంతుల స్వామి) అతిపెద్దది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు సుమారు 10లక్షల మందికిపైగా భక్తులు వస్తుంటారు. ఇంతటి ప్రజాసమూహం సందర్శించే పెద్దగట్టు జాతర నిర్వహణపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న విమర్శలు భక్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరకు అప్పటికప్పుడు నిధులు విడుదల చేయడం, ఆయా నిధులతో తాత్కాలిక పనులు చేపట్టడం వంటి తీరును భక్తులు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ప్రభుత్వంలోని 11 శాఖల నడుమ సమన్వయంతో చేపట్టాల్సిన ఏర్పాట్లను దేవాదాయ, మునిసిపల్ శాఖలే సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, సూర్యాపేట

- సమ్మక్కసారక్క తర్వాత పెద్దజాతర
- రెండేళ్లకోసారి జాతర, అయినా నిధుల విడుదలలో జాప్యం
- 21 రోజులే గడువు.. ఇంకా పూర్తిస్థాయిలో చేపట్టని జాతర పనులు
- ప్రతీ పర్యాయం తాత్కాలిక ఏర్పాట్లే
- 10లక్షల మంది పాల్గొనే జాతర

పెద్దగట్టు ఆలయం సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోకి వస్తుంది. పెద్దగట్టుపైన దేవాదాయ శాఖ, గుట్ట కింద మునిసిపాలిటీ శాఖలు భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అయితే ప్రతీ జాతరలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎవరి పరిధిలో వారు పనులు చేసుకుంటున్నారు. నిధుల వినియోగంలో సమన్వయం లేదని గత పాలకవర్గాలు ఆరోపిస్తున్నాయి. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులు పెట్టుకుంటున్నారే తప్ప ప్రత్యక్షంగా జాతర ఏర్పాట్లపై ఇంతవరకు సమీక్ష నిర్వహించలేదు. మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపులో ఆలస్యంతో ఆదరాబాదరాగా పనులు చేపడుతున్నారు.

21 రోజుల్లో జాతర

పెద్దగట్టు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ పర్యాయం జాతరకు ఇంకా 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఫిబ్రవరి 2న దిష్టిపూజతో లింగమంతుల పండుగ వాతావరణం నెలకొంటుంది. అప్పటినుంచి భక్తుల రాకపోకలు జరుగుతాయి. నిధులు మంజూరుకాకపోవడవంతో ఇంతవరకూ జాతర పనులు మొదలుకాలేదు. వివిధ శాఖల నుంచి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. ఒక్క శాఖకు కూడా ఇంతవరకు నిధులు కేటాయింపు జరగలేదని సమాచారం. పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, ఇతర శాఖలకు నిధులు కేటాయిస్తే పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానిస్తూ అధికారులు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఆ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో ఆయా ప్రధాన శాఖల అధికారులకు దిగులు పట్టుకుంది. ఎప్పుడు ప్రకటించి, ఎప్పుడు పనులు చేపట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా చెరువులో నీరు ఉండటంతో గుట్టకు దూరంలో 70ఎకరాలను లీజుకు తీసుకున్నారు. అక్కడ సౌకర్యాలు కల్పించడానికి అధికారులు సమయం సరిపోదంటున్నారు. త్వరగా నిధులు కేటాయిస్తేనే పనులు చేసే అవకాశం ఉంటుందని కొంతమంది అధికారులు తెలిపారు.



పెద్దగట్టు వద్ద నిరుపయోగంగా ఉన్న మంచినీటి కుళాయిలు

శాశ్వత పనులేవీ?

గుట్టపైన శాశ్వత పనులను పూర్తిస్థాయిలో చేపట్టలేదు. గుట్టపైకి వచ్చే భక్తులకు కొంతమేర

మిగతా 6వ పేజీలో...


నల్లగొండ మునిసిపాలిటీలో కౌన్సిల్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వరంగల్‌కు దీటుగా అభివృద్ధి

- కౌన్సిల్ హాల్ ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తరహాలో వరంగల్‌కు దీటుగా నల్లగొండ అభివృద్ధి చెందుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మునిసిపాలిటీలో నూతనంగా నిర్మించిన మునిసిపల్ కౌన్సిల్ భవనాన్ని శనివారం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో రూ.250కోట్లతో రింగ్‌రోడ్డు ఏర్పాటుకు, రూ.30 వేల కోట్లతో ఔటర్ రింగ్‌రోడ్డు పనులకు టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. అదేవిధంగా దేవరకొండ రోడ్డులో ఉన్న 55ఎకరాల స్థలంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నల్లగొండ పట్టణాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా పనులు తన సొంత నిధులతో చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గ పనులు త్వరితగతిన అవుతున్నాయన్నారు. 10 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కనీసం రేషన్‌కార్డు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తోందన్నారు. అభ్యంతరకర భాష పద్ధతిని మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి మునిసిపల్ చైర్మన్‌ను, కమిషనర్‌ను, చివరికి తనపై కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం ప్రజలందరూ గమనిస్తునే ఉన్నారన్నారు. భాష మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు.

అదేవిధంగా కౌన్సిలర్లు అధికారంలో లేకపోయినా ప్రజలకు సేవా చేయాలన్నారు. అనంతరం కౌన్సిల్ సభ్యులకు శాలువా లు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మను అబ్బగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిరెడ్డి మృతి బాధాకరం

● మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



రంగశాయిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి, నాయకులు

నిడమనూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, నిడమనూరు మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి అకాల మరణం బాధాకరమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రంగశాయిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న సుఖేందర్‌రెడ్డి శనివారం మండలంలోని తుమ్మడం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి రంగశాయిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ముంగి శివమారయ్య, నరేందర్‌రెడ్డి, మేరెడ్డి చెన్నకృష్ణారెడ్డి అన్నారు.

హాలియా: హాలియా పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కోనాల శివయ్య శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శనివారం సాయంత్రం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కడారి అంజయ్యయాదవ్, బానావత్ బాబురావునాయక్, ముచ్చా అరుణ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, న్యాయవాది కట్టెబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, కౌన్సిలర్లు వర్ర వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, జూపల్లి శ్రీనివాస్, పిల్లి ఆంజనేయులు, శ్రీనివాస్, చాపల సైదులు తదితరులు నివాళులర్పించారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జానా

తిరుమలగిరి(సాగర్), జనవరి 25(ఆంధ్రజ్యోతి): డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు శాగం పెద్దిరెడ్డి కుటుంబాన్ని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి పరామర్శించారు. పెద్దిరెడ్డి సోదరుడు శాగం నాగిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. దీంతో జానారెడ్డి పెద్దిరెడ్డి స్వగృహానికి చేరుకొని సంతాపం తెలిపారు. ఆయన వెంట హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు బీటీ.గోవిందరెడ్డి, నాయకులు లాలునాయక్, శాగం నాగిరెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ధనలక్ష్మికి కెనడా యునివర్సిటీ డాక్టరేట్



ధనలక్ష్మికి డాక్టరేట్‌ను అందజేస్తున్న కెనడా యునివర్సిటీ ప్రతినిధులు

దేవరకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా, సామాజికంగా ప్రజలకు సేవలు అందించినందుకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, తాటికోలు మాజీ సర్పంచ్ జూలూరి ధనలక్ష్మికి కెనడాలోని బ్రాంప్టన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం కర్ణాటకలోని బెంగుళూరు పట్టణంలో గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి ప్రతినిధులు సురేష్‌గుప్తా, శివప్ప ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రలో పాల్గొనడం, తాటికోలులో ఇసుక అక్రమ రవాణా అరికట్టడం, నాటుసారాను అరికట్టేందుకు చర్యలు చేపట్టడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేయడంతో యూనివర్సిటీ గుర్తించి డాక్టరేట్‌ను అందజేసినట్లు ధనలక్ష్మి శనివారం తెలిపారు. తాటికోలుకు చెందిన జూలూరు ధనలక్ష్మికి డాక్టరేట్ రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంజయ్యకు డాక్టరేట్ ప్రదానం

దేవరకొండ: రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరకొండకు చెందిన ఆమంచ అంజయ్యకు ఆసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ తమిళనాడు ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను శనివారం అందజేశారు. అంజయ్య విద్యా, సామాజిక, సంస్కృతిక, ఉద్యోగ సంఘాల్లో చురుకుగా పాల్గొంటూ రమ్య ఫౌండేషన్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

మతసమరస్యానికి ప్రతీక



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న స్థానికులు

చింతపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని కుర్మపల్లి గ్రామంలో 67వ మహబూబ్ సుబాని దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు ఎస్‌కే.గోరేమియా, ఉమ్మర్‌మియా, మోతీన్‌పాష ఆధ్వర్యంలో ఒంటెపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త విరబొమ్మల ధనంజయ్య, శ్రీశైలం సోదరులు, మాజీ సర్పంచ్ మిర్యాల జైపాల్, ఉప సర్పంచ్ ఈరటి మల్లేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎగిరిశెట్టి అనిత శ్రీశైలం, యాదగిరి పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

అడవిదేవులపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో వరలక్ష్మి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో కూడా మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారులు గ్రామీణ స్థాయినుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వర్‌రావు, కంచుకొమ్ముల శ్రీనివాస్, మర్రి రమేష్, గొడుగు సైదయ్య, మట్ట సైదయ్య, అన్నెబోయిన మల్లిఖార్జున్, సైదయ్య, హనుమంతు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

వేములపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సంగారెడ్డిలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని మండల కేంద్రంలో సీపీఎం జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పూర్తిస్థాయిలో రేషన్‌కార్డులను అందించాలన్నారు. తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, నాయకులు పాదూరి గోవర్ధని, కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, పుట్టల సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

● యువతీ యువకులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి ● సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ ● అంతటా ఓటరు దినోత్సవం



తహసీల్దార్ హరిబాబుకు అవార్డును అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని సబ్ కలెక్టర్ ఎం.నారాయణ అమిత్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, డీఏవో శర్మ, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. దేవరకొండలో రెవెన్యూ, స్పోర్ట్స్ అసోసియేషన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో డిండి చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక మాట్లాడారు. కార్యక్రమంలో దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీవో డానియెల్, ఎంఈవో మాత్యనాయక్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌వీటీ, దేవరకొండ సీఐ నర్సింహులు, కమీషనర్ సుదర్శన్, కృష్ణవేణి పాఠశాల నిర్వాహకులు రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని తహసీల్దార్ పుష్పలత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వేములపల్లి జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డీటీ కోటేశ్వరీ, ప్రధానోపాధ్యాయులు రమేష్, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, డీటీ నాగమణి, ఆర్ఐ లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, సర్వేయర్ నాగసాయి, సెక్రటరీ శేఖర్, శ్రీను, రఘు, శంకరయ్య పాల్గొన్నారు.

నిడమనూరు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఎస్ఐ గోపాల్‌రావు, ఎంఈవో లావూరి వెంకన్న, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, భూక్యా శ్రీను, హెచ్ఎం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: హాలియాలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రఘు, ఎంఈవో గుండా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడులో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఆర్ఐ నజీర్ పాల్గొన్నారు.

చందంపేట: చందంపేట మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో చందర్‌నాయక్, ఆపరేటర్ అనిల్, పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌కుమార్, ఎంఈవో వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో తహసీల్దార్ సరోజపావని ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాము, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకారమందించాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకారమందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ చివరి సమావేశానికి డిప్యూటీ కలెక్టర్ అమిత్ నారాయణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ పదవులు శాశ్వతంకాదని, ప్రజల మనసుల్లో స్థానమే శాశ్వతమన్నారు. కౌన్సిలర్‌గా గెలుపొంది, ఎమ్మెల్యే అయిన బీఎల్ఆర్‌ను కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించగా, పీసీసీ మాజీ నేత కుందూరు జానారెడ్డి ఫోన్‌లో పదవీ విరమణ పొందుతున్న కౌన్సిల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. 10 నెలలుగా సాగని సమావేశం చివరి రోజున కొనసాగింది. సమావేశంలో సిబ్బంది వేతనాలు, పరిశుభ్రత, ప్రజారోగ్యానికి సంబంధించి 21అంశాలతో కూడిన ఎజెండాపై కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. అనంతరం కౌన్సిల్ సభ్యులు సందరయ్య పార్కులో గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మీ, కమిషనర్ ఎండీ. యూసుఫ్, బీజేపీ ఫ్లోర్‌లీడర్ రమాశ్యాం పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు చివరి అవకాశం

హాలియా, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారి కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్లకు తాత్కాల్ ద్వారా ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు అవకాశం ఉందని హాలియా ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ గుండా కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ పదో తరగతి అడ్మిషన్లకోసం వారు చదివిన రికార్డ్ షీట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, ఇంటర్ అడ్మిషన్లకోసం పదో తరగతి పాస్ మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటోలతో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇంటర్ కోర్సు ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని, తెలుగు మీడియంలో చేరే అవకాశం ఉందని, మిగతా వివరాలకు సెల:9010750686ను సంప్రదించాలన్నారు.

రైతులు సహకరించాలి

పెద్దవూర, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పశుగణనకు రైతులు సహకరించాలని పశువైద్యాధికారి నులక నాగార్జునరెడ్డి అన్నారు. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పశుగణన బట్టుగూడెం గ్రామంలో శనివారం ఇంటింటికి తిరిగి పశువుల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ అనిత, గోపాలమిత్ర గాలి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెద్దఅడిశర్లపల్లి, జనవరి25(ఆంధ్రజ్యోతి): పీఏపల్లి మండలంలోని ఎర్రగుంటతండ, తిరుమలగిరి గ్రామాల్లో రేషన్ డీలర్ల వద్ద అక్రమంగా నిల్వఉంచిన 53 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, గుడిపల్లి పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆర్ఐసీఎస్ సైదులు వివరాల ప్రకారం ఎర్రగుంటతండ, తిరుమలగిరి రేషన్ డీలర్లు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని దాచి ఉంచారనే సమాచారం మేరకు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, పోలీసులు దాడిచేశారు. రెండు షాపుల్లో మొత్తం 53.5 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌చేసి నిల్వదారులపై కేసు నమోదు చేశారు. దాడిలో దేవరకొండ డిటీసిఎస్ శ్రీనివాస్‌గౌడ్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక సంపదను కాపాడాలి : ఆలంపల్లి నర్సింహ

దేవరకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటుచేసి చారిత్రక సంపదను కాపాడాలని దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో దేవరకొండ పట్టణంలోని గాంధీబజార్‌నుంచి ఖిల్లాలోని పార్కువరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దేవరకొండ ఖిల్లాకు 750 సంవత్సరాలకుపైగా సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ ఖిల్లా చరిత్రను, విశిష్టతను తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, కౌన్సిలర్ పొన్నబోయిన భూదేవి సైదులు, గాజుల మురళి, సముద్రాల ధనంజయ్య, యూసుఫ్ పర్వన్, సురిగి శంకర్, ముశిని అంజన్, ఖిల్లా పరిరక్షణ కమిటి సభ్యులు, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం అభివృద్ధికి కృషి

పెద్దఅడిశర్లపల్లి, జనవరి25(ఆంధ్రజ్యోతి): శాలివాహన సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుమ్మరి సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధారపు భిక్షపతి అన్నారు. శనివారం పీఏపల్లి మండలకేంద్రంలో కుమ్మర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కుమ్మరి కులస్థులందరూ ఒక్కతాటిపై ముందడుగు వేసినట్లయితే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. అంతకుముందు జిల్లా మాజీ అధ్యక్షుడు స్వర్గీయ నిమ్మనకోటి కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ఘనపురం శంకర్, వెంకటయ్య, చిట్టిమల ఆంజనేయులు, శ్యాంప్రసాద్, వెంకటేశ్వర్లు, రామచంద్రం,శ్రీనివాస్, శివశంకర్, వెంకటయ్య, రాగ్య, సాయిలు, కోటయ్య, కాశిరాములు, దుర్గయ్య పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయాలి

కొండమల్లేపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా దేశానికి తమవంతు సేవ చేయాలని ఎంఈవో నాగేశ్వర్‌రావు సూచించారు. శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాల ఆవరణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కాగా విద్యార్థుల దేశభక్తి కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ

గుర్రంపోడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండలం నడికుడ జడ్పీ ఉన్నత పాఠశాలకు 10 డెస్క్ బెంచీలను గ్రామానికి చెందిన వాసా రాంబాబు, శ్రవణ్‌కుమార్‌లు తమ తండ్రి సుదర్శన్ జ్ఞాపకార్థం బహూకరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ గెలాక్సీ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షు మారెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు క్షేత్రయ్య, కొండ నరేష్, టంగుటూరి సురేష్, గంగాధర్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



ఉత్తమ అవార్డు అందుకుంటున్న అనిల్‌కుమార్

నిడమనూరు: ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించినందుకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కొనిక అనిల్‌కుమార్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టర్ ఇలాత్రిపాఠి నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా అవార్డు అందుకున్న అనిల్‌కుమార్‌ను తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, భూక్యా శ్రీను, సీనియర్ అసిస్టెంట్ సందీప్, సిబ్బంది అభినందించారు.

నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందించాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నేటి నుంచి అమలు చేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ, రైతు భరోసా పథకాల్లో నిజమైన లబ్ధిదారులకు పథకాలను అందించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. పథకాల అమలులో భాగంగా ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేయగా మండలంలోని దాచారం గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పథకాల అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తిరుమలస్వామి, ఎంపీవో సంగీత, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంచంద్రాగూడెంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు తిరుమలగిరి వజ్రం మాట్లాడుతూ ఆరోగ్య సమాజ నిర్మాణానికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ స్వర్ణలత, నాయకులు గంగాధర్, విజయేందర్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాస్, ఉపేందర్, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దవూర, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహన సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మండలకేంద్రంలో తహసీల్దార్ సరోజపావని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధారి భిక్షపతి, వెలిజాల వెంకన్న, చిట్టిమల్ల దశరధ, చిట్టిమల్ల ఆంజనేయులు, నిమ్మనగోటి శ్యాంప్రసాద్, సురేష్, శ్రీకాంత్, నలికంటి వెంకటయ్య, చిట్టిమల్ల చిరంజీవి పాల్గొన్నారు.

ఆటలపోటీలు

చింతపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో ఆధ్యాపకులు విద్యార్థులకు శనివారం ఆటపోటీలు నిర్వహించారు. ప్రధానంగా వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు ఖో-ఖో, క్రికెట్, వాలిబాల్, క్యారంబోర్డు, వ్యాసరచన పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచారు.

కేశంనేనిపల్లి ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు పథకాలను జనవరి 26న మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభిస్తున్న సందర్భంగా ఉమ్మడి పిఏపల్లి మండలంలోని కేశంనేనిపల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. మండలంలోని ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నేడు నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి 25వ తేదీవరకు అప్లికేషన్ ఇచ్చినా అర్హులైతే జాబితాలో పేరు ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ఎంపీడీవో చంద్రమౌళి, రేషన్‌కార్డులను తహసీల్దార్ మధుహాసిని, శ్రీనివాస్‌రావు, ఇందిరమ్మ ఇళ్లను ఏపీవో శ్రీనివాస్, రైతు భరోసాను వ్యవసాయ అధికారి పాండు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఉద్యోగులు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశాల్లో నివాసముండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్‌సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ డీఈ సుధీర్‌కుమార్‌లకు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఆ సంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల్లో చాలామంది పనిచేస్తున్న ప్రదేశాల్లో నివాసముండడం లేదన్నారు. దీంతో విద్యుత్ సరఫరాపై క్షేత్రస్థాయి పర్యవేక్షణ లోపిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 24విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సత్వరమే అధికారుల స్పందన కొరవడి వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఫోర్‌మెన్లు బినామీలను నియమించుకొని కొలువులు చక్కబెడుతున్నట్లు ఆరోపించారు. పలువురు ఉద్యోగులు హైదరాబాద్ నగరంలో స్థిరపడి వారానికి ఒకరోజువిధులకు హాజరై మిగతారోజుల్లోనూ విధులకు హాజరైనట్లుగా రికార్డుల్లో సంతకాలు చేస్తున్నట్లు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

హాలియా, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హాలియా మున్సిపాలిటీలోని ఆకాంక్ష హైస్కూల్ కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు అన్నారు. శనివారం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. గవర్నర్‌గా భవ్యశ్రీ, ముఖ్యమంత్రిగా ఐశ్వర్య, ఉపముఖ్యమంత్రిగా స్పందన, హోంమంత్రిగా గమన, విద్యాశాఖమంత్రిగా తరుణి, వెంపటి హాస్య, ఎమ్మెల్యేగా రమావత్ వెంకటేష్, ఎంపీగా వైష్ణవి, ఎమ్మెల్సీగా అశ్విత, కలెక్టర్‌గా రమ్యశ్రీ, జాయింట్ కలెక్టర్‌గా మర్రి తిలక్, డిప్యూటీ కలెక్టర్‌గా జోష్నికరెడ్డి, డీఈవోగా కామాక్షిలు పాత్రలు పోషించి పాఠశాలను సందర్శించి తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, ప్రిన్సిపాల్ యం.రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తేలిన రైతుభరోసా లెక్క

● సాగు భూములకే పెట్టుబడి సాయం

● యోగ్యం కాని భూములు 406 ఎకరాలు

నిడమనూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సాగుకు యోగ్యం కాని భూముల వివరాల సర్వే పూర్తి కావడంతో మండలంలో రైతుభరోసా లెక్క తేలింది. అధికారులు నాలుగు రోజులపాటు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి 406 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూమిగా గుర్తించారు. ఇందులో రైస్ మిల్లులు, గుళ్లు, నాలాలు, రహదారులు, గుట్టలు, కొండలు ఉన్నాయి. ఏటా మండలంలో 35,315 ఎకరాల భూములకు రైతుబంధు వర్తించేది. సాగుకు నోచని భూముల వివరాలు తేలడంతో రూ.48.72 లక్షలు ప్రభుత్వానికి మిగలనుంది. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలు ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో అధికారులు చదివి వినిపించారు. సర్వేను కొన్ని గ్రామాల్లో వ్యతిరేకించారు. సాగు చేసిన భూములను సైతం సాగు చేయని విధంగా సర్వే చేశారని రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వం ధరణిలో నమోదైన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రామాణికంగా తీసుకొని అన్ని రకాల భూములకు రైతుబంధు పేరిట ఎకరానికి ఏడాదికి పంట పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.10 వేలు అందజేసింది. ధరణిని ఆసరాగా తీసుకున్న అనేక మంది రైతులు భూములు సాగు చేయకుండానే పెట్టుబడి సాయం అక్రమంగా పొందారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పేరిట ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతుందని గుర్తించింది. సాగు చేయని భూములకు పెట్టుబడి సాయం అందించేది లేదని తేల్చి చెప్పింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతుబంధు పేరును రైతుభరోసాగా మార్చి పంటలు సాగు చేసిన భూములకు మాత్రమే ఏటా రూ.12 వేలు(సీజన్‌కు రూ.6 వేల చొప్పున) రైతుల ఖాతాలో జమ చేయనుంది. దీనికోసం అధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సర్వే చేసి సాగుకు నోచని భూముల వివరాలు గుర్తించారు. గత పంటల సీజన్‌లో కూడా ప్రభుత్వం రైతుబంధు డబ్బులు వేయలేదని రైతులు కొంత అసంతృప్తితో ఉన్నారు. రైతుభరోసా కింద వానాకాలం, యాసంగి రెండు సీజన్ల డబ్బులు పడతాయా లేక ఈ సీజన్ డబ్బులు మాత్రమే వేస్తుందా అనేది రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నేటి నుంచి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల్లో రైతుభరోసా కోసం రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.